కథానిక

# అయస్కాంతపు హద్దులు

బి. ఆర్. మోహనరావు

అప్పుడే రైలు దిగి యింట్లో అడుగుపెట్టిన రఘునాథానికి యింటి పరిస్థితి అవగాహన చేసుకుందామని ఎంత ప్రయత్నించినా, అది కొరుకుడుపడని సమస్యగా పరిణమించింది. సాధారణంగా, సెలవులకు యింటికి రాగానే నవ్వుతూ ఉలాసాగా మాట్లాడే అక్క కూడా గదివిడిచి బయటకు రాలేదు. అథవా, ఆ వచ్చింది తన తమ్ముడని తెలుసుకుందామనే ఉత్సాహం కూడా లేకపోయింది. పోనీ, తలిదండ్రులు, ముభావంగా ఉన్నారంటే దానికి ఏదో ఒక కారణాన్ని చెప్పుకొని, సమర్థించుకోవచ్చు. కాని, అక్క కూడా అలా ఉన్నదంటే ఏదో బలవత్తర కారణం ఉండకపోదు. ఈ కారణాలన్నీ విచారిస్తూ కూర్చుంటే, అతనిలో ఉన్న మానవత్వం పూర్తిగా అణగద్రొక్కబడిపోయేపాటి అవకాశాలు కూడా లేకపోలేదు. ఇంతకూ, ఈ రభసకు కారణం—ఎంతగా ఆలోచించినా, ఈషణ్మాత్రమైనా స్ఫురించలేదు రఘునాథానికి. ఎదురుగా, తన విధిని సక్రమంగా నిర్వర్తిస్తున్నానని చెప్పటానికి, గడియారం పదకొండుగంటలు కొట్టింది. తన తండ్రి, గదిలో నుండి బయటకు వచ్చి లోపలకు తొంగిచూసేసరికి, గదిలో తను అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటున్నాడు. ఏమనుకున్నాడోగాని ఆయన "ఏరా రఘూ పరీక్షలన్నీ బాగా రాశావా?" అనిమాత్రం ప్రశ్నించాడు. "ఆ బాగానే రాశాను" అనిమాత్రం తాను జవాబిచ్చి, తండ్రి అక్కడున్నాడో, లేడో చూద్దామని పక్కకు తిరిగేసరికి ఆయన ఆ ప్రదేశం విడిచి, అప్పటికే వెళ్ళిపోయాడు. తాను వచ్చిన అరగంటకుగాని తండ్రి తనతో మాట్లాడకపోవటం, అబ్బాయి ఏమనుకుంటాడో అని ఏదో ఒక ప్రశ్న వేయటం. తాను జవాబిచ్చేసరికి ఆ స్థలాన్ని విడిచి వెళ్ళటం, ఇవన్నీ వింత చర్యలుగా కన్పించాయి రఘునాథానికి. తనంటే తండ్రికి ఎంత ప్రేమో తనకు తెలుసు. బాల్యంనుండీ ఏ లోటూ రాకుండా ఎలా పెంచినదీ తెలుసు—మూడు నెలల క్రితం సెలవులకు యింటికి వచ్చినప్పుడు తన తండ్రి ఎంత ఆప్యాయంగా తన్ను పలకరించి, ఆనందాన్ని పొందినదీ తాను ఎలా మర్చిపోగలడు? ఇవన్నీ నాటకంలో తెర వెనుక తెర లేచినట్లుగా తన మనస్సులో ఎలా కదులుతున్నదో ఇప్పుడు తాను అనుభవిస్తున్నాడు. పోనీ అది తన తండ్రి ఏదో కోపంలో ఉండి అలా చేశాడని సరిపెడుదామనుకున్నా, తన తల్లి ధోరణి యింకా విచిత్రంగా ఉన్నది. తాను, సెలవులకు వచ్చినప్పుడల్లా, ఎంత పనిలో ఉన్నా దాన్ని కట్టిపెట్టి తనతో అధమం ఒక గంటసేపైనా మాట్లాడి, ఎన్నో ప్రశ్నలడిగి తన జవాబులతో తృప్తిపడే తన తల్లి కూడా, వంటిల్లు విడిచిబయటకు రాకపోవటం ఆశ్చర్యంగా తోచింది. అక్క సంగతి వేరుగా చెప్పటం అనవసరం. తాను నవ్వుతూ, యితరులను నవ్విస్తూంటే అక్క కూడా దూరంగా తప్పుకొని తిరగటం చూస్తూంటే, వీళ్ళందరూ న్యాయమూర్తులుగాను, తానొక దోషిగా వారి ఎదుట చేతులు కట్టుకొని నిలబడినట్లుగా తోచింది రఘునాథానికి. నిర్దోషిత్వాన్ని గాని నిరూపించుకునేందుకు ప్రయత్నం చేసేవాడుగా ఎంత ఆలోచించినా, తనపై వారు మోపిన నేరం ఛాయకూడా గోచరం కావటంలేదు. వీరిలో ప్రజ్వలితంగా ఉండే ఆ క్రోధాగ్ని పరిణామాలకు దారితీస్తుందో?

మధ్యాహ్నం భోజనాలదగ్గిర కూడా తనతో తల్లి ఎక్కువగా మాట్లాడలేదు. పోనీ, తల్లిని ప్రశ్నించి అసలు విషయాన్ని తెలుసుకునే పాటి సాహసం కూడా లేకపోయింది. చదువుకున్నవాడు కాబట్టి ఈ తరుణంలో తను విజ్ఞతను ప్రదర్శించాలి. వారంతా గంభీరంగా

ఉంటే, తాను మాత్రం ఎందుకుండకూడదు? వాళ్ళను కలవరపెట్టే సమస్య గూర్చి తనకు తెలియకపోయినా, తెలుసుకోవాలనే ఆసక్తి కనబరిస్తే తాను చాలా చులకనగా చూడబడుతాడు. వారితోపాటు తానుకూడా గంభీరంగా ఉంటే, అప్పుడు పరిస్థితులు మరోలా మారే అవకాశాలున్నాయి. అయినా, అంటీ అంటనట్లు దూరంగాఉంటే, తన కుమారునిలో ఏమాత్రం దోషిత్వాన్ని ఆరోపించే అవకాశం తలిదండ్రులకు వుండదు. ఏది ఎలా ఉన్నా, తాను కూడా గంభీరంగా ఉండాలనే నిర్ణయానికి వచ్చిన రఘునాథానికి, కాసేపటిలో ఆందోళన పొందటానికి తగిన కారణం లేకపోయింది. ఇదివరలో సెలవులకు యింటికి వచ్చినపుడు తాను ఎలా ఉన్నాడో, ఇప్పుడు కూడా అలాగే ఉన్నాడు. ఆ పెను తుఫాను అనంతరం ఆకాశం యెంత నిర్మలంగా ఉంటుందో, అలా ఉన్నది తన హృదయం ఇప్పుడు...అందుకోసమే కాబోలు...మానవునకు, ప్రకృతికి చక్కని బాంధవ్యం ఉంటుందని మానవుడు ప్రకృతినుండి వేరువడటం అనేది జరగదని పెద్దలంటారు.

ఆరోజంతా అవిధంగానే గడచిపోయింది. రాత్రి భోజనాలైనపిదప అక్కతో మాట్లాడుదామని వెళ్ళేసరికి ఆమె అసలు సంగతి బైట పెట్టింది. "తాను కాలేజీలో తన సహాధ్యాయిని "కాంత"తో స్నేహం చేసుకొని తుదకు ఆమెను ప్రేమించి, త్వరలోనే ఆమెను వివాహం చేసుకోబోతున్నట్లుగా తండ్రికి ఎవరో ఒక జాబు వ్రాశారని" అక్క చెప్పగానే ఒక్కసారి నవ్వి ఊరుకున్నాడు. ఆ నవ్వు వెనుక అతనిలో ద్యోతకమయ్యే గర్వం ప్రతిధ్వనిస్తోంది. ఆ గర్వానికి కూడా కొంత కారణం లేకపోలేదు. తాను క్లాసులో అందరికన్నా ఒక మెట్టు పైనే ఉంటాడు. ఆ సంగతి తోటి విద్యార్థులే కాకుండా "లెక్చరర్లు" కూడా ఒప్పుకుంటారు. పురుషులలో తనకున్నంత పలుకుబడి, గౌరవం విద్యార్థినులలో కాంతకున్నది. ఒకసారి కాంతకన్నా తనకు ఎక్కువ మార్కులొచ్చేసరికి, రెండవసారి ఆ గౌరవాన్ని ఆమె తన్నుకుపోయింది. అంత గౌరవాన్ని పొందుతున్న తాను ఈమాత్రం దానికి గర్వపడటంలో ఆశ్చర్యంలేదు. ఇందులోని సత్యాసత్యాలతో నిమిత్తం లేకపోతే, అంతటి గౌరవం పొందటం తేలిక కాదు. అందరు విద్యార్థులూ కాంతను చూస్తున్నట్లే తానూ చూస్తున్నాడు. ఆమెను చూసినప్పుడు అందరూ పొందే భావాలనుతాను కూడా పొందుతున్నాడు. కాని వారికీ తనకూ కొంత వ్యత్యాసమున్నది. మేధాసంపత్తిలో ఇరువురూ సమ ఉజ్జీలే. ఇతరులలో లోపించిన ఆ అర్హత తనలో ఉన్నది. కాబట్టి కాంత ప్రక్క తన్ను నిలబెట్టటంలో ఆ వ్యక్తి గౌరవానికి మెరుగుదిద్దాడు. మంచో చెడో అది తరువాత సంగతి అక్కతో అదంతా శుద్ధ అబద్ధమనీ, తనపై కిట్టక ఎవరో ఆ విధంగా చేశారనీ, తన తలిదండ్రుల ఆగ్రహానికి అదే కారణమైతే అందులో తనపాత్ర ఈషణ్మాత్రమైనా లేదనీ చెప్పాడు. తాను చెప్పినదంతా నిజమే. చదువుకోసం కాలేజీలో చేరాడు. చదివి తనకు తన వంశానికి గౌరవం తెచ్చి పెట్టటము తన విద్యుక్తధర్మం. దాన్ని నెరవేర్చాలనే దీక్షలో నిమగ్నుడైన తాను ఈ ఐహిక విషయాలకు అతీతుడు. ఉన్న వాళ్ళందరిలోకీ కొంచెం అందగత్తె తెలివిగలదీ కాంతే కాబట్టి ఆమెను ఒకసారి కాకపోతే రెండుసార్లు చూసి ఉంటాడు. అథవా, ఆమెతో మాట్లాడాలనే తలపు ఇంతవరకు ఆనిలో తలెత్తలేదు.

మరునాడు తల్లి చాటుకు తీసికొని వెళ్ళి ఈ విషయాన్నే చెప్పేసరికి, ఆమెకూ అక్కకిచ్చిన జవాబిచ్చాడు. ఆ సమాధానం ఆమెకు తృప్తికరంగా తోచింది కాబోలు – నవ్వుతూ మాట్లాడటం మొదలు పెట్టింది. ఇక మిగిలినదల్లా తన తండ్రి ఒకడే. ఆయన్ను సమాధానపర్చటం అంత తేలికైన పని కాదు. ఏ విషయాన్నీ అంత త్వరగా నమ్మే స్వభావం కాని తన తండ్రిని కూడా నమ్మపరచ గలిగింది ఆ జాబు...రాత్రి, భోజనాలై, గదిలో తన తండ్రి చదువుతూంటే మెల్లిగా వెళ్ళి "మీ కోపానికి కారణం నాకు తెలుసు. అక్కనూ అమ్మనూ కలవర పెట్టగలిగిన ఆ ఉత్తరమే మీ మనస్సుకు నొప్పి కలిగించి ఉండాలి. అదంతా పట్టి బూటకం, దాన్ని నమ్మకండి" అని తన

తండ్రితో చెప్పేసరికి, ఆయన తీక్షణంగా చూసి చిరునవ్వు నవ్వి, మళ్ళీ పుస్తకంలో లీనమై పోయాడు. ఆ నవ్వు తనకు కొంత ఉపశాంతిని చేకూర్చింది. ఇంతమందిని తాను ఒప్పించటంలో తన ప్రజ్ఞ బాగా ఉపయోగించింది. యింతకూ ఆ ఉత్తరం వ్రాసిన వ్యక్తి ఎవరై ఉంటారోనని ఎంత ఊహించినా అంతు దొరకలేదు. ఒక చిన్న తుఫాను లేకెత్తించి, దానిలో తాను చిక్కుకునేలా చేసిన ఆవ్యక్తి ఎదురుగా ఉంటే, అందుకు తగిన శిక్ష పొందేవాడు. ఈ సంఘటన వల్ల సత్ఫలితం కూడా కలుగక పోలేదు. తన మనోకాశంలో ఇప్పటి వరకు మిణుకు మిణుకు మంటున్న ఒక తార శాంత అని చెప్పటం బాగుంటుందేమో. ఈ క్షణం నుండి దివ్య తారగా ప్రకాశిస్తూ, తన తేజంతో ఆకాశాన్నంతా ఆక్రమించేట్టున్నది. ఆ తారే తన జీవితానికి ధృవతారగా మారే అవకాశం ఉంటే, తానెంత అదృష్టవంతుడు! ఆ విధంగా ఎందుకు జరుగకూడదు? దానికి కొంత నిదర్శనం కూడా లేకపోలేదు. ఏదో ఒక మహత్తర శక్తి తన్ను ఆమెవైపు లాగుతోంది. అయస్కాంతంలో అణగి ఉన్న అంతర్గత ఆకర్షణ శక్తి వంటిది బహుశా ఆమెలో కూడా అంత లీనంగా ఉండాలి. లేకపోతే తన్ను ఎలా ఆకర్షించ గలుగుతుంది? ఆ ఆకర్షణశక్తి ప్రసరించే హద్దులోపల తాను నిలబడి ఉన్నాడు. ఏనాటికైనా తనకన్నా ఆమెకున్న ఆశక్తి బలీయమైనది, దానికి లోబడక తప్పదు. ఇదంతా ఆ జాబు ఫలితం, ఆ అజ్ఞాత మిత్రుని సహకారం.

శెలవులు మూడు నెల్లూ ఎలాగో గడచి పోయాయి. ఏపని చేస్తున్నా శాంత రూపం ఎదురుగా ప్రత్యక్షమయేది. ఎల్లప్పుడూ ఆమెకు సంబంధించిన తలపులే మెదడులో మెసలేవి. కాని వీటివల్ల ఆమెకు మరింత దగ్గరగా చేరగలుగుతున్నాడు. బహుశా ఆమెకూడా తన్ను గురించి యింతగా బాధ పడుతూంటుందేమో? పిచ్చిగాని, ఆమెకా అవుసరం ఎందుకుంటుంది? తనకైనా ఆపాటి అవుసరం లేకపోయేదే. కాని ఆ మిత్రుడి తెచ్చిపెట్టిన ఈ అజ్ఞాత ప్రణయం వల్లే తాను యింతగా బాధ పొందుతున్నాడు.

“శాంతా!”

తలవంచుకొని నడుస్తున్న శాంత ఒక్కసారి వెనక్కు తిరిగి చూసింది తన్ను పిలచిన దెవరా అని. అయిదారుగజాల దూరంలో రఘునాథం కన్పించాడు. నిజంగా ఆనాడు ఏమైనా సరే, ఆమెతో మాట్లాడాలని నిర్ణయించుకొన్న రఘునాథం గబగబా నాలుగడుగులు వేసి, ఆమెను కలుసుకున్నాడు. రఘునాథాన్ని చూడగానే ఎక్కడలేని తీవ్రత, గంభీరం, ఆమెను ఆవరించాయి.

“శాంతా! మీతో ఒకమాట మాట్లాడాలి”

అంత గంభీరతలోనూ ఆమె నవ్వకుండా ఉండలేక పోయింది.

“మీకు కోపం రాకుండా ఉంటే ఒక మాట చెప్పదలుచుకున్నా. అది మీకు కోపకారణమైనా దాన్ని సాంతంగా విని, మీ అభిప్రాయాన్ని తెలియపర్చండి” అని రఘునాథం అంటూంటే, ఆమె ఆ విషయం తెలుసుకోవాలని ఆత్రుతగా అతనివైపు చూసింది.

“నేను మిమ్మల్ని గాఢంగా ప్రేమించి, త్వరలోనే వివాహం చేసుకోబోతున్నట్లుగా మా నాన్నకు ఎవరో జాబు వ్రాశారు. ఎందుకైనా మంచిదని ఆ సంగతి మీకు తెలియపరుస్తున్నా. ఇందులో ఈషణ్మాత్రమైనా నిజం లేదు. అవిధంగా అనుకోటానికైనా అవకాశంలేదు. మీరెవరో నాకు సరీగా తెలియదు. అలాగే నా విషయంకూడాను. నేను కాలేజీకు వస్తూంటే, నన్ను చూసి అందరూ నవ్వుతూంటే, వారిదాకా ఈ విషయం వెళ్ళిందని గ్రహించాను. దీనివల్ల మీకు ఏదైనా బాధ కలిగితే అందుకు నేను బాధ్యుణ్ణి కాదు. శెలవు” అని చెప్పి, ఆమె జవాబుకోసం నిరీక్షించకుండా వెళ్ళిపోయాడు రఘునాథం.

ఈ పలుకులు ఆమెకు చెబుతున్నపుడు, ఇన్నాళ్ళనుండీ తాను పొందిన ఆవేదన, అనుభూతి పూర్తిగా తన్ను నిర్వీర్యుణ్ణి చేశాయి. ఆమె ఎదుట తాను ఒక అశక్తుడివలె నిలబడ్డాడు. ఆ అశక్తతకు ఆమెకారణం. ఆమెతో చెప్పటంవల్ల తనపైనుండి ఒక పెద్ద భారం తొలగింపబడింది. ఇన్నాళ్ళనుండీ ఆమె